క్లుప్తంగా

శ్రీవారికి వెండి దీప స్తంభాలు

తిరుమల : తిరుమల శ్రీవారికి నాలుగు వెండి దీప స్తంభాలను కానుకగా శనివారం రాత్రి బెంగళూరుకు చెందిన దాతలు రాధాకృష్ణ, శ్యామ్‌సుందర్‌శర్మ, శ్రీధర్ అందించారు. మహాద్వారం వద్ద పేష్కార్ రామకృష్ణకు అందజేశారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణ


వెపన్ ట్రైనింగ్‌లో విద్యార్థులు

తిరుపతి రూరల్ : తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్‌లోని 29వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. శనివారం ఈ మేరకు తనపల్లెలోని శశి ఇంగ్లీష్ మీడియం స్కూల్ మైదానంలో ఈనెల 17వ తేదీ వరకు శిక్షణ తరగతులు కొనసాగనున్నాయి. అందులో భాగంగా ఎన్‌సీసీ విద్యార్థులకు వెపన్ ట్రైనింగ్‌తోపాటు డ్రిల్ చేయించారు. కమాండర్ కల్నల్ సత్యేంద్ర దహియా, కమాండింగ్ ఆఫీసర్ కిషన్ దత్, సుబేదార్ మేజర్ ఎస్వీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

తాగునీరు, మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్

తిరుపతి తుడా : తాతయ్యగుంట గంగమ్మ జాతరకు విచ్చేసే భక్తులకు శనివారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తాగునీరు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య పలువురు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ గంగమ్మ తల్లి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఎస్పీ భక్తవత్సలం, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈ తులసీ కుమార్, ఆర్‌ఓ సేతుమాధవ్, ఆలయ ఈఓ జయకుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

తిరుపతి క్రైమ్ : రుయా ఆస్పత్రిలోని డీ అడిక్షన్ సెంటర్‌లో చికిత్సపొందుతున్న వారికి శనివారం పండ్లు, పాలు పంపిణీ చేశారు. సీఐ రామచంద్ర ఆదేశాల మేరకు ఎక్సైజ్ పోలీసులు డీ అడిక్షన్ సెంటర్‌ను సందర్శించారు. వారు మాట్లాడుతూ మద్యానికి బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. వ్యవసాలను వదిలేసి నూతన జీవితానికి నాంది పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమావతికి భూమన నివాళి


ప్రేమావతికి అంజలి ఘటిస్తున్న భూమన

తిరుపతి మంగళం : సాహితీవేత్త, పద్మావతి డిగ్రీ కళాశాల తొలి అధ్యాపకులు డీఎం ప్రేమావతి శుక్రవారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి శనివారం ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని వేడుకున్నారు. కుటుంబీకులను పరామర్శించారు.

కృష్ణస్వామిరాజుకు పురస్కారం


అవార్డు అందుకుంటున్న కృష్ణస్వామిరాజు

తిరుపతి కల్చరల్ : తిరుపతికి చెందిన ఆర్‌సీ.కృష్ణస్వామిరాజు రచించిన 'మేకల బండ' నవలకు గోవిందరాజు సీతాదేవి సాహితీ పురస్కారం లభించింది. శనివారం నెల్లూరుకు చెందిన ఎస్ఆర్‌కే విశ్వసాయి స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాహితీ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు సుభద్రాదేవి, రచయితలు డాక్టర్ సుంకర గోపాల్, డాక్టర్ పెళ్లూరు సునీల్, గాయత్రి, కేపీ మునిసురేష్ పిళ్లై, పేట యుగంధర్, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో ఎలుగుబంటి

తిరుమల : తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో శనివారం రాత్రి ఎలుగుబండి సంచారం కలకలం రేపింది. ఘాట్‌లోని చివరి మలుపువద్ద ఎలుగుబంటి కనపడడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. కొద్దిసేపటి తర్వాత ఎలుగు అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

శ్రీవారి సారె సమర్పణలో కళారూపాలు







దొరకునా ఇటువంటి సేవ!

శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా నాలుగో రోజు శనివారం భక్తులు పోటెత్తారు. వేయికళ్ల దుత్తలతో అమ్మవారిని సేవించుకున్నారు. పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. వేపాకు మండలు చేతపట్టి గ్రామదేవతను దర్శించుకున్నారు. సంప్రదాయబద్ధంగా కైకాల కులస్తులు దొర వేషాలు ధరించి శక్తిస్వరూపిణిని ఆరాధించారు. రజకులు మంత్రి వేషధారులై నగరంలోని వీధుల్లో సంచరిస్తూ ఇంటింటా పూజలందుకున్నారు. ఈ క్రమంలోనే విశేషాలంకరణలో కొలువుదీరిన గంగమ్మ మూలవిరాట్‌మూర్తిని తిరునగరివాసులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. - తిరుపతి కల్చరల్







వివిధ వేషాలు ధరించి గంగమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తులు, అమ్మవారి ఆలయంలో తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు

నోటీస్ బోర్డు

- తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా మాతంగి వేషాలతో దర్శించుకోనున్న భక్తులు.
- మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీరోడ్డులోని పంచముఖ ఆంజనేయస్వామి గుడి నుంచి సాయంత్రం 4.30 గంటలకు ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావ ర్యాలీ
- మంగళం రోడ్డులోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు మాలల ఆత్మగౌరవ సభ.
- ఇస్కాన్ రోడ్డులోని రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో ఆర్‌సీ కృష్ణస్వామి రాజు రచించిన 'యద్భావం తద్భవతి' ఆధ్యాత్మిక కథల పుస్తకం ఆవిష్కరణ.
- శ్రీకపిలేశ్వర స్వామి వారి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు పత్ర, పుష్పయాగానికి అంకురార్పణ.
- యశోదా నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 5 గంటలకు మేడే సాంస్కృతికోత్సవాల విజేతలకు బహుమతులు ప్రదానం.
- తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలకు సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ. విశేష పూజలు
- శ్రీగోవిందరాజస్వామి బుగ్గోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి స్నపన తిరుమంజనం, సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ, ఆస్థానం.
- మాతృదేవోభవ సత్సంగ్, సంఘమిత్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు అంతర్జాతీయ మాతృ దినోత్సవ వేడుకలు, ఆదర్శ మాతృమూర్తులను ఎంపిక చేసి లక్ష్మీదేవి అవార్డులు ప్రదానం.

బస్సులు బావురు!

ప్రతిష్ఠాత్మక ఆధ్యాత్మిక క్షేత్రం.. నిత్యం లక్షలాది మంది రాకపోకలు సాగించే నగరం.. అంతటి ప్రాధాన్యత గల తిరుపతిలోని సెంట్రల్ బస్టాండ్‌ను ప్లాట్‌ఫామ్‌ల కొరత వేధిస్తోంది. పలు సర్వీసులకు కనీసం ప్రయాణికులను ఎక్కించుకునే వెసులుబాటు లేని దుస్థితి దాపురించింది. పార్కింగ్ స్థలం లేక బస్టాండ్ ఆవరణలో ఖాళీగా కనిపించిన ప్రాంతంలో బస్సులు నిలుపుకునే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆయా సర్వీసుల కోసం ప్రజలు వెతుక్కోవాల్సి వస్తోంది. విధులు నిర్వర్తించేందుకు ఉద్యోగులు సైతం ఇబ్బంది పడాల్సి వస్తోంది.

- సెంట్రల్ బస్టాండ్‌లో ప్లాట్‌ఫామ్‌ల కొరత
- పలు సర్వీసులకు అందుబాటులోని స్థలం
- ఆవరణలో ఎక్కడ పడితే అక్కడే పార్కింగ్
- వెతుక్కోలేక ప్రయాణికుల అవస్థలు
- ఉద్యోగులకు సైతం తప్పని తిప్పలు


ప్లాట్‌ఫామ్ లేకపోవడంతో రోడ్డుపైనే ప్రయాణికులను బస్సు ఎక్కించుకుంటున్న దృశ్యం

తిరుపతి అర్బన్ : తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌కు నిత్యం లక్ష మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. 16 ఎకరాల విస్తీర్ణంలో బస్టాండ్ ఉంది. ఈ ఆవరణలోనే శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు, పల్లెవెలుగు పేరుతో మరో నాలుగు బస్టాండ్లు ఉన్నాయి. వీటిలో మొత్తం 63 ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి. అయితే బస్టాండ్‌కు వచ్చే పలు బస్సులకు ప్లాట్‌ఫామ్ సౌకర్యం లేదు. దీంతో ప్రయాణికులు, ఆర్టీసీ ఉద్యోగులకు తిప్పలు తప్పడం లేదు. ప్రధానంగా తిరుచానూరుకు నిత్యం భక్తుల రద్దీ ఉంటుంది. 30 నిమిషాలకు ఓ పల్లెవెలుగు సర్వీస్‌ను తిరుచానూరుకు ఏర్పాటు చేశారు. అయితే తతఃఈ బస్సులకు ప్లాట్‌ఫామ్ లేకపోవడం గమనార్హం.


ప్లాట్‌ఫామ్ లేని తిరుచానూరు సర్వీస్

నిత్యం 2,700 సర్వీసులు

సెంట్రల్ బస్టాండ్‌కు రోజూ 2,700 సర్వీసులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లిపోతుంటాయి. తూర్పు వైపు నుంచి బస్సులు లోనికి వస్తాయి. పడమర వైపు నుంచి దక్షిణం దిశగా బయటకు వెళుతుంటాయి. అయితే తిరుచానూరు బస్సులకు ప్లాట్‌ఫాం లేకపోవడంతో తిరుమల బస్టాండ్ సమీపంలో రోడ్డుపైనే పెట్టేస్తున్నారు. దీంతో ప్రయాణికులు సెంట్రల్ బస్టాండ్ పరిధిలోని నాలుగు బస్టాండ్లకు చెందిన 63 ప్లాట్‌ఫామ్‌లను చూసినా తిరుచానూరు బస్సులు కనబడడం లేదు. ఎందుకంటే అవి రోడ్లపైనే ఉంటున్నాయి. అంతేకాదు శ్రీకాళహస్తి, పుత్తూరు తదితర ప్రాంతాల నుంచి తిరుమలకు వెళ్లే సర్వీసులను తిరుమల బస్టాండ్‌లో పెట్టరాదనే నిబంధనలు ఉన్నాయి. దీంతో వారంతా రోడ్ల పైనే ఉంచుకుని ప్రయాణికులతో మాట్లాడి ఎక్కించుకోవాల్సిన దుస్థితి తలెత్తింది. ప్లాట్‌ఫామ్ లేని సర్వీసులను అడ్డదిడ్డంగా నిలిపేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. ప్రధానంగా అధికారులు కొత్తగా ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేసే అంశంపై ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సర్దుబాటు చేస్తాం

ప్లాట్‌ఫామ్ లేని సర్వీసులకు పార్కింగ్ స్థలాలను సర్దుబాటు చేస్తాం. ప్రధానంగా తిరుచానూరు బస్సులకు ప్లాట్‌ఫామ్ లేదు. ఉన్నతాధికారులతో మాట్లాడి పల్లెవెలుగు బస్టాండ్‌లో ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తాం. అలాగే తిరుమలకు వెళ్లే వివిధ డిపోలకు చెందిన సర్వీసులకు ప్లాట్‌ఫామ్ వసతిపై దృష్టి సారిస్తాం. ట్రాఫిక్ సమస్యలు లేకండా చర్యలు తీసుకుంటాం.

– డీఆర్ నాయుడు, ఏటీఎం, సెంట్రల్ బస్టాండ్

ఆర్మీకి రూ.60వేల విరాళం


డీడీ అందిస్తున్న సాకేత్ కుటుంబసభ్యులు

తిరుపతి కల్చరల్ : భారత సైన్యానికి రూ.60వేలను విరాళంగా తిరుపతికి చెందిన సాకేత్ అందించారు. తన చిన్న కుమారుడు ఆశ్రిత్ శ్రీరామ్ పుట్టిన రోజును పురస్కరించుకుని వేడుకలకు ఖర్చు చేసే నగదును దేశ రక్షణకు అందించినట్లు తెలిపారు. శనివారం ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి డీడీ అందజేశారు. కార్యక్రమంలో దాత కుటుంబీకులు అనిరుధ్ శ్రీరామ్, సుచిత్ర శ్రీ అనన్య పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగులకు హెల్మెట్లు


హెల్మెట్లు పంపిణీ చేస్తున్న టీటీడీ చైర్మన్

తిరుమల : టీటీడీ ఉద్యోగులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. శనివారం తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు చేతులమీదుగా హెల్మెట్లు అందించారు. చైర్మన్ మాట్లాడుతూ ఉద్యోగుల భద్రత కోసం హెల్మెట్లను వితరణగా అందించేందుకు గుంటూరుకు చెందిన జలాది రఘురామ్, ఢిల్లీకి చెందిన నవీన్ ముందుకు వచ్చారని తెలిపారు. మొదటి విడతగా సుమారు రూ.5లక్షల విలువైన 555 హెల్మెట్లు విరాళంగా ఇచ్చారని చెప్పారు. 15 రోజుల్లో మరో 500 హెల్మెట్లు అందించనున్నారని వివరించారు. అనంతరం మరో 5వేలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారామ్, వీజీఓలు రామ్ కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

తిరుచ్చిపై వెంకన్న విహారం


ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా వేకువనే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం దేవదేవేరులను తిరుచ్చిపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు.

నివాళి.. పరామర్శ


ఎర్రమరెడ్డి పార్థివదేహానికి నివాళులర్పిస్తూ..

చంద్రగిరి : పాతపేటకు చెందిన రాజులగారి ఎర్రమరెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వెంటనే ఎర్రమరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు.


ఉదయ్ కుటుంబీకులను పరామర్శిస్తున్న మోహిత్‌రెడ్డి

పాకాల : ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఉదయ్‌కుమార్‌రెడ్డి ఇంటికి మోహిత్‌రెడ్డి వెళ్లి ఆయన కుటుంబీకులను పరామర్శించారు. ఉదయ్ కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

బాబు నాటకం.. పేదలకు అవమానం

– సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు


మాట్లాడుతున్న బీవీ రాఘవులు

తిరుపతి కల్చరల్ : పీ–4 పేరిట పేదలను అవమానించేలా చంద్రబాబు నాటకాలాడుతున్నారని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. శనివారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. పీ–4 పథకం కింద పేదలను కార్పొరేటు శక్తులకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. ఆయా కంపెనీల వారు ముందుగా కార్మికులకు వేతనాలు పెంచి నిజాయితీ నిరూపించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి పత్రిక, వాక్, సభా స్వాతంత్ర్యానికి భంగం కలిగించేలా ఉందని మండిపడ్డారు. బ్లాక్ చేసిన వెబ్‌సైట్‌లు, సోషల్ మీడియా వేదికలను వెంటనే అనుమతించాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ కొనుగోలు పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను తక్షణమే రద్దు చేసుకుని ప్రజలపై భారం తప్పించాలని స్పష్టం చేశారు. అమరావతి, పోలవరం మినహా మిగిలిన సమస్యలను పట్టించుకోకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించేలా ఉద్యమాలకు రూపకల్పన చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో సీపీఎం నేతలు నాగరాజు, కందారపు మురళి పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో 'ఎస్వీసీసీ' సత్తా

తిరుపతి సిటీ : ఎస్వీయూ శనివారం విడుదల చేసిన డిగ్రీ 5వ సెమిస్టర్ ఫలితాలలో బాలాజీ కాలనీలోని ఎస్వీసీసీ విద్యార్థులు సత్తా చాటారు. బీకామ్‌లో శేఖర్ తేజశ్రీ, సుపాగి జయశేఖర్, మద్దూరి అనూష, బీఎస్సీలో కందుకూరి చార్విత 8.5 పాయింట్లు సాధించినట్లు ప్రిన్సిపల్ నాగరాజా తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్‌తోపాటు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎంపిక


తులసీరామన్, జయరాంనాయుడు, రామయ్య, కుప్పుస్వామినాయుడు

పాకాల : స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. శనివారం చార్టెడ్ ప్రెసిడెంట్ లయన్ జి.గురుస్వామినాయుడు అధ్యక్షత, కమిటీ సభ్యుల సమక్షంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా కేఎస్ తులసీరామన్, టి.జయరామనాయుడు, కార్యదర్శిగా జి.రామయ్య, కోశాధికారిగా ఎం.కుప్పుస్వామినాయుడు ఎన్నికయ్యారు.

శ్రీవారి సేవలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు



జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రామచందర్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. పండితులు వేద ఆశీర్వచనాలు, అధికారులు ప్రసాదాలను అందజేశారు.

- తిరుమల

పల్లెల్లో 'పచ్చ' చిచ్చు!



ప్రశాంత పల్లెల్లో పచ్చమూక చిచ్చుపెడుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తుడా నిధులతో ఏర్పాటు చేయించిన బెంచీలపై విషం చిమ్ముతోంది. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా నిధుల దుర్వినియోగానికి పాల్పడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో కక్షలు కార్పణ్యాలను రేకెత్తించేందుకు తెగబడుతోంది. అధికారమే అండగా బెంచీలకు పసుపు రంగు వేయించేస్తోంది. స్థానికులు అభ్యంతరపెడుతున్నా ఖాతరు చేయకుండా దౌర్జన్యాలకు దిగుతోంది. అందులో భాగంగానే పాకాల మండలం పదిపుట్లబైలులోని బెంచీలకు తమ పార్టీ రంగులు వేసేసింది. గ్రామస్తులు వ్యతిరేకించినప్పటికీ బేఖాతరు చేసేసింది. దీనిపై స్థానిక ప్రజానీకం ఆగ్రహం వ్యక్తం చేసింది. సత్తా ఉంటే కొత్తగా మరో పది బెంచీలు ఏర్పాటు చేయాలి కానీ, ఇలా దుర్మార్గంగా ప్రవర్తించడం సరికాదని హితవు పలికింది. - పాకాల


ప్రశ్నిస్తున్న గ్రామస్తులు